అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

కాద్లాపూర్‌లో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దళిత నాయకులు

బాన్సువాడ రూరల్, జనవరి 1 : బాన్సువాడ మండలంలోని కాద్లాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి దళిత నాయకులతో కలిసి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు నర్సింహులు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 నాటికి పనులు పూర్తి చేసి విగ్రహావిష్కరణ చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్, దళిత నాయకులు బంగారు మైశయ్య, మన్నెచిన్న సాయిలు, రవి, సురేశ్, గణేశ్, పోతు రాజు సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, జనవరి 1 : నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామ శివారులో బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామానికి చెందన షేక్‌గౌస్(45) పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. మృతుడి భార్య 15 ఏండ్లక్రితం పిల్లలను తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై, మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి లుంగీని తీసుకుని బయటికి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో మృతుడి సోదరుడు సోమలింగేశ్వర ఆలయానికి వెళ్లే దారిలో వెతకగా పొలం గట్టుపై ఉన్న చెట్టుకు ఉరేసుకొని కనిపించినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు షాబుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఘటనలో..

నస్రుల్లాబాద్, జనవరి 1 : నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామానికి చెందిన ధనుంజయ్(28) మద్యానికి బానిసై మృతి చెందినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి నాలుగుండ్ల క్రితం వివాహమైంది. కొన్ని నెలల తర్వాత భార్యతో విడాకులయ్యాయి. అప్పటి నుంచి ఏ పని చేయకుండా మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. మంగళవారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. సెల్‌ఫోన్ పోయిందని గ్రామంలోని బాలాజీ వైన్స్ పక్కన ఉన్న పర్మిట్ రూం వద్దకు వెళ్లాడు. మద్యం మత్తులో బోర్లా పడ్డాడు. పర్మిట్ రూంలో పని చేసే మోసిన్ మృతుడి తండ్రికి చెప్పడంతో బాన్సువాడ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపాడు. మృతుడి తండ్రి పురం నాగ్‌నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామానికి చెందిన గొట్ట సంతోష్(28) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. దుర్కి గ్రామానికి చెందిన దుర్గం సూరి, దుర్గం ఆమని, దుర్గం సంజీవ్ గొట్ట సంతోష్‌ను చంపుతామని బెదిరించగా గత నెల 18వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం చికిత్స పొందుతూ బాన్సువాడ ప్రభుత్వ దవాఖానలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్

నిజాంసాగర్/కామారెడ్డి, జనవరి 1 : నూతన సంవత్సరం సందర్భంగా ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మాచారెడ్డి/రాజంపేట్/బీబీపేట, జనవరి 1 : మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ అటవీప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం సందర్భంగా చుట్టుపక్కల జిల్లాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయాధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. రాజంపేట, బీబీపేట్ మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఆయా మండలాల్లోని ప్రముఖ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కామారెడ్డి, జనవరి 1 : కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌ను బుధవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వారిని కలిసిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ హఫీజ్, నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ, మాసుల లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు ఇన్‌చార్జి ఎస్సైగా ఆంజనేయులు

ఆంజనేయులు

భిక్కనూరు, జనవరి 1 : భిక్కనూరు ఇన్‌చార్జి ఎస్సైగా ఆంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దోమకొండ ఎస్సైగా పనిచేస్తున్న ఆయనను భిక్కనూరు ఇన్‌చార్జి ఎస్సైగా బాధ్యతులు అప్పగిస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన ఇన్‌చార్జి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

110 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

కామారెడ్డి, జనవరి 1 : కామారెడ్డి జిల్లా పోలీసులు డిసెంబర్ 31వ తేదీ సందర్భంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా 110 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి, 66 వెహికిల్స్ సీజ్ చేసినట్లు ఎస్పీ సింధూ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి సబ్ డివిజన్‌లో 60, ఎల్లారెడ్డి సబ్ డివిజన్‌లో 28, బాన్సువాడ సబ్ డివిజన్‌లో 22 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గేలా పోలీసు శాఖ వారు తీసుకునే చర్యలకు ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

మహిళ అదృశ్యం

భిక్కనూరు, జనవరి 1 : భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన తల్క సుశీల కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడేది. గత నెల 30న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త సిద్ధరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డిమాండ్లు నెరవేర్చాలని హమాలీల ఆందోళన

ఎల్లారెడ్డి ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం వద్ద నిరవధిక సమ్మెలో పాల్గొన్న హమాలీలు, బాన్సువాడలో..

బాన్సువాడ టౌన్/కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్/బిచ్కుంద, జనవరి 1 : సివిల్ సప్లై హమాలీల ఎగుమతి, దిగుమతి రేట్లు, ప్రమాద బీమా తదితర కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు అన్నారు. పెంచిన హమాలీ రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న నిరవధిక సమ్మెను బాన్సువాడ మార్కెట్ కమిటీలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. హమాలీల ఎగుమతి, దిగుమతి రేట్లు క్వింటాలుకు రూ.29కి పెంచాలని, హమాలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సొంత గోదాములను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక హమాలీ యూనియన్ వర్కర్స్ సభ్యులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా ఆర్డీవో కార్యాలయం ఎదుట సివిల్ సప్లై హమాలీలు, ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో సివిల్ సప్లై హమాలీల నిరవధిక సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది వీఎల్.నరసింహారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, ఉపాధ్యక్షుడు దశరథ్, మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సుదర్శన్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. పెంచిన హమాలీ రేట్ల జీవోను వెంటనే అమలుచేయాలని సివిల్ సప్లయీస్ హమాలీలు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద జిల్లా శాఖ ఆదేశాల మేరకు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సివిల్ సప్లై హమాలీ యూనియన్ అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షుడు కాశీరాం, కార్యదర్శి రవి, కోశాధికారి శ్రీకాంత్, సభ్యులు నరేశ్, రాములు, ప్రభాకర్, బాబు, అల్లు, స్వీపర్ పోశవ్వ పాల్గొన్నారు. బిచ్కుందలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్ గొండ, హమాలీ సంఘం అధ్యక్షుడు పండరి, కార్యదర్శి అశోక్, హమాలీలు సంతోష్, రవీందర్, అంజయ్య, శివాజీ, నాందేవ్, సాయిలు, శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి తిర్మలాపూర్ వాసి మృతి

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివకుమార్, స్థానికులు

నిజాంసాగర్, జనవరి 1 : చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన మహ్మద్‌నగర్ మండలంలోని కోమలంచ గ్రామ శివారులో చోటు చేసుకున్నది. స్థానికులు, ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బెస్త సాయిలు (36) మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామ శివారులోని మంజీరా నదిలో మంగళవారం చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టే వల కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగి మృతి చెందాడు. అతడి సోదరుడు బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాపు చేస్తున్నట్లు ఎస్సై తెలియజేశారు.

మద్యం మత్తులో యువకుడు..

రామారెడ్డి, జనవరి 1: మద్యం మత్తులో యువకుడు చెరువులో స్నానానికి వెళ్లి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. రామారెడ్డి ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పొట్టిగారి శివప్రసాద్ (28) గతనెల 31న స్నేహితులతో కలిసి దావత్ చేసుకొన్నాడు. మంగళవారం అర్ధరాత్రి అధికంగా మద్యం తాగి, మత్తులో ఒంటిపై మంచినూనె పోసుకొని, స్నానం చేయడానికి గ్రామ శివారులో ఉన్న పటేల్ చెరువు వద్దకు వెళ్లాడు. శివప్రసాద్ తమ్ముడు జగదీశ్వర్ అన్నను అనుసరించాడు. శివప్రసాద్ చెరువులో దూకి అపస్మారక స్థితికి వెళ్లాడు. జగదీశ్వర్ చెరువులో నుంచి అతడిని తీసుకువచ్చి చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుమ్ము రేగుతోంది.. పాణం పోతోంది

మాల్తుమ్మెద వద్ద దుమ్ములోనే వెళుతున్న వాహనాలు

నాగిరెడ్డిపేట శివారులో వాహనాల వెనుకాల ఇదీ పరిస్థితి

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 1: మండలంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనుల్లో మట్టి వేసి వదిలేయడంతో..దుమ్మురేగి వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంతోపాటు మాల్తుమ్మెద, పోచారం, బంజారా, ధర్మారెడ్డి, రాఘవపల్లి, జప్తిజాన్కంపల్లి గ్రామాల మీదుగా రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. మట్టి వేసిన స్థలాల్లో గుత్తేదారు నీటిని పట్టించకపోవడంతో దుమ్ము రేగుతున్నది. వాహనాలు వెళ్తుంటే..వెనుక వెళ్తున్న ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో దుమ్ముతో వాహనదారులు, స్థానికులు రోగాల బారిన పడుతున్నామని, దుమ్ములో ఒక వాహనానికి మరో వాహనం కనిపించక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి అధికారులు స్పందించి రోడ్డుపై దుమ్ములేవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు యూరియా పంపిణీ

రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న సహకార సంఘం సిబ్బంది

లింగంపేట, జనవరి 1: లింగంపేట సహకార సంఘం పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు బుధవారం యూరియా పంపిణీ చేసినట్లు సహకార సంఘ చైర్మన్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. యాసంగిలో పంటలు సాగు చేస్తున్న రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. సహకార సంఘం పరిధిలోని ఐలాపూర్, పోతాయిపల్లి, శెట్పల్లి, భవానీపేట, లింగంపేట గ్రామాల్లోని గోదాముల్లో యూరియా అందుబాటులో ఉన్నదని ఆయన తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు.

డిసెంబర్‌లో రూ.9.80 కోట్ల
మద్యం అమ్మకాలు

నాగిరెడ్డిపేట, జనవరి 1: ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో డిసెంబర్ మాసంలో రూ. 9.80 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎల్లారెడ్డి అబ్కారీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షకీర్ హైమద్ తెలిపారు. సర్కిల్ పరిధిలో ఎల్లారెడ్డి ఒక బార్, 2 మద్యం దుకాణాలు, లింగంపేట మండలంలో 2 మద్యం దుకాణాలు, గాంధారి మండలంలో 2 దుకాణాలు, నాగిరెడ్డిపేటలో 1 దుకాణం ఉన్నట్లు చెప్పారు. డిసెంబర్‌లో 9.80 కోట్ల అమ్మకం, డిసెంబర్ 31న రూ.85 లక్షల మద్యం అమ్మకాలు జరిగినట్లు చెప్పారు.

రాంపల్లి తండాలో భోగ్ భండార్

పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

లింగంపేట, జనవరి 1: మండలంలోని రాంపల్లి తండాలో బుధవారం గిరిజనులు భోగ్ భండార్ కార్యక్రమం నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్‌సేవాలాల్, జగదాంబా మాతా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బంజారా శక్తి పీఠ్ ప్రధాన కార్యదర్శి పౌరాదేవి, ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్, గిరిజనులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నాగిరెడ్డిపేట, జనవరి 1: తాండూర్ త్రిలింగేశ్వరాలయం వద్ద మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేయి ఏండ్ల చరిత్ర కలిగిన గొప్ప ఆలయం త్రిలింగేశ్వరాలయమని, శివయ్య ఆశీర్వాదంతో ఆలయ చరిత్ర, ఫొటోలతో క్యాలెండర్‌ను తయారు చేయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మ దత్తు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ పద్మశ్రీకాంత్, వార్డు కౌన్సిలర్లు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 1: పట్టణంలోని 12వ వార్డు సమస్యల గురించి బుధవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, వార్డు కౌన్సిలర్ జంగం నీలకంఠం అప్ప కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ 12వ వార్డులోని పోలీస్‌స్టేషన్ నుంచి హౌసింగ్ బోర్డు వరకు ఉన్న సీసీ రోడ్లు ఏండ్ల క్రితం వేసి ఉండడంతో ప్రస్తుతం అవి చెడిపోయి గుంతలుపడడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే వార్డులోని వడ్డెర కాలనీ, లింగారెడ్డిపేట్ లంబాడీ తండా, బీడీకాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికిగానూ నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో స్థానిక నాయకులు నునుగొండ శ్రీనివాస్, మంచిర్యాల విద్యాసాగర్, అల్లం శ్రీనివాస్, గాదె తిరుపతి తదితరులున్నారు. ఎమ్మెల్యేను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసిన మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు ఆయనకు మిఠాయిలు తినిపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పాదయాత్రతో
షిర్డీకి బయలుదేరిన భక్తులు

మద్నూర్, జనవరి 1: మండలకేంద్రానికి చెందిన సాయి భక్తులు బుధవారం పాదయాత్రతో షిర్డీకి బయలుదేరి వెళ్లారు. దెగ్లూర్ వరకు వెళ్లి అక్కడి నుంచి షిర్డీకి వెళ్లే భక్తులతో కలిసి వెళ్తామని తెలిపారు. మద్నూర్ నుంచి వెళ్లిన వారిలో ప్రకాశ్, శ్యామ్, సాయి తదితరులు ఉన్నారు.

త్రిలింగేశ్వరాయలంలో అభిషేకాలు

తాండూర్ త్రిలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నాగిరెడ్డిపేట, జనవరి 1: తాండూర్ గ్రామ శివారులోని ప్రముఖ శైవక్షేత్రమైన త్రిలింగేశ్వరాలయంలో బుధవారం నూతన సంవత్సరం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం చేరుకున్న భక్తులు ప్రధానాలయంలోని రామేశ్వరుడు, భీమేశ్వరుడు, సోమేశ్వరుడులకు ప్రత్యేక అభిషేకాలు చేసి కొత్త సంవత్సరంలో చల్లగా చూడాలని వేడుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, **NERALLA HANMANTHU** (Old Name) R/o. H.No.5-9-75, Budhawarpet,Town and Dist Nirmal,Telangana. Have Changed My Name As **NERELLA HANMANTHU S/o Late NERALLA SHIVVIAH** (New Name)
NTZ-338373

WANTED

★**ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను,** పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

EDUCATION

★**రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech,** ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337305

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.